క్లుప్తంగా

మెరిట్ విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పదో తరగతిలో సాధించిన ఫలితాలను ఉన్నత చదువుల్లోను కొనసాగించాలని విద్యార్థులను అడబాల రత్న ప్రసాద్, డాక్టరు అద్దాల సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో న్యాయవాది పెండెం శ్రీదేవి, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు, కుమార్ యాదవ్, సత్యనారాయణ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాలి



కాపు రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తున్న నాయకులు

బోట్‌క్లబ్: నిరుపేద కాపులకు విద్య, ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని జై కాపుసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ బీఎస్ఎస్ ప్రకాశం (చినబాబు) డిమాండ్ చేశారు. కాకినాడలో ఒక హోటల్‌లో ఆదివారం జై కాపుసేన జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బసవా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ చినబాబు మాట్లాడుతూ రానున్న డీఎస్సీలో కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలను ఎక్కువ మంది లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. కార్యదర్శి వెంకన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలలో కాపు కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాపుసేన కార్యవర్గ సభ్యుడు గళ్ల రామాంజనేయులు, కూనసాని నాగబాబు, తిక్కా శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ మ్యాచ్‌కు పోటెత్తిన క్రీడాభిమానులు



డీఎస్ఏలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ ఫ్యాన్ పార్కుకు వచ్చిన క్రీడాభిమానులు

నాగమల్లితోట జంక్షన్: పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ఐపీఎల్ క్వాలిఫయ్యర్-2 మ్యాచ్ ప్రత్యక్ష వీక్షణకు స్థానిక జిల్లా క్రీడా మైదానంలో క్రికెట్ అభిమానులు పోటెత్తారు. బీసీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ ఫ్యాన్ పార్కులో మ్యాచ్ చూసేందుకు వచ్చిన అభిమానులు అహ్మదాబాద్‌లో కురుస్తున్న వర్షం వల్ల చాలా మంది వెనక్కు వెళ్లిపోయారు. వర్షం తెరిపి ఇచ్చిన తరువాత మ్యాచ్ మొదలవడంతో సుమారు 20 వేల మంది స్క్రీన్లపై వీక్షించారు. కాకినాడ ఎంపీ, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు సహకారంతో ఏర్పాటు చేసిన పార్కును ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్‌కుమార్ తదితరులు పార్కును సందర్శించారు.

గ్రంథాలయాలతో మరింత పరిజ్ఞానం



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న నాగరాజు

పెద్దాపురం: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విద్యార్థికి మరింత పరిజ్ఞానం సాధ్యపడుతుందని, శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం పుస్తక పఠనం, కథలు చదవడం నేర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లియ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవిశ్రాంత ఆర్జన!

- వృద్ధులకు ఆర్థిక భరోసా లక్ష్యంగా స్వావలంబన్ యోజన
- నేటి పొదుపే రేపటి భవిత
- 18 నుంచి 60 ఏళ్ల వారు అర్హులు
- కేంద్ర ప్రభుత్వ పథకంతో ధీమా

నాగమల్లితోట జంక్షన్: నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వావలంబన్ యోజన పథకం వృద్ధులకు ఆర్థిక అండగా నిలవనుంది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి దేశంలోని సామాన్యులు సైతం 60 ఏళ్లు నిండిన తర్వాత పెన్షన్ పొందేందుకు పథకం అవకాశం కల్పిస్తోంది. బడుగు, బలహీన వర్గాల వారితో పాటు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆటో, ట్యాక్సీ, లారీ డ్రైవర్లు, ఇరత ప్రైవేట్ ఉద్యోగులు, చిన్న, పెద్ద వ్యాపారులు ఈ పథకాన్ని ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుత రోజువారీ ఖర్చులను అధిగమించడం సామాన్యులకు కష్టంగా ఉన్న నేపథ్యంలో ఈ పథకం ఎంతో ప్రయోజనం కలిగించనుంది. సంపాదించే వయసులోనే ఎలాంటి పొదుపు చేయకుండా ఉంటే వృద్ధాప్యంలో ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఎంతో మంది వృద్ధ తల్లిదండ్రులను కొడుకులు పట్టించుకోకపోవడం ప్రస్తుతం చూస్తున్నాం. ఆసరా కరువై.. పనిచేసే శక్తిలేక.. ఆర్థిక అండ కరువై ఎందరో వృద్ధులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. వయసు పెరగడంతో పాటు జీవన వ్యయాలు కూడా పెరుగుతున్నాయి. ఈ సమస్య నుంచి గట్టెక్కాలంటే ఆర్థిక స్వేచ్ఛ అత్యంత అవశ్యకం. గౌరవంగా జీవించేందుకు ఈ పథకం అవకాశం కల్పిస్తోంది.

స్వావలంబన్‌తో ప్రయోజనాలు...

వృద్ధాప్యంలో పింఛన్ అందజేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు భారతీయ పౌరులందరూ ఈ ఖాతాను తెరిచేందుకు అర్హులు. ప్రతి పౌరుడు ఏడాదిలో కనీసం రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు తగ్గకుండా పొదుపు చేయాలి. దానికి ప్రభుత్వం ఏటా రూ.600 కలుపుతుంది. ప్రతి ఖాతాదారుడికి ఫొటోతో పాటు పాన్ కార్డును ఇస్తుంది. ఈ కార్డుతో ఎన్‌పీఎస్‌లో సభ్యత్వం ఉన్నట్టు గుర్తించొచ్చు. ఖాతా తెరిచిన 45 రోజుల్లో ఈ కార్డు పొందొచ్చు.

పింఛన్ పొందేది ఇలా..

ఖాతాదారుడి వయస్సు 60 ఏళ్ల నిండిన వెంటనే వారు జమచేసిన డబ్బు మొత్తంలో 60 శాతాన్ని ఒకేమారు చెల్లిస్తారు. మిగతా 40 శాతం వారి ఖాతాలోనే ఉంచి, దానిపై వచ్చే రాబడిని జీవితాంతం ప్రతినెలా పింఛన్ రూపంలో చెల్లిస్తారు. ఖాతాదారుడు మరణిస్తే అప్పటి వరకు ఖాతాలో పొదుపు చేసిన మొత్తాన్ని వారి నామినీకి అందిస్తారు. 60 ఏళ్ల తర్వాత పింఛన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే ఖాతాలో నిల్వ ఉన్న 40 శాతం సొమ్మును కూడా వారికే అందజేస్తారు.



వృద్ధాప్యంలో మంచి పథకం..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ఆటో, ట్యాక్సీ, లారీ డ్రైవర్లు ఈ పథకంపై అవగాహన కలిగి ఉండడం ఎంతో ముఖ్యం. వృద్ధాప్యంలో ఒకరిపై ఆధార పడకుండా ఉండాలంటే వయసులో ఉన్నప్పుడే పొదుపు చేయడం అవసరం, శ్రేయస్కరం.

– కె.పద్మనాభం, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు, కాకినాడ

క్రికెట్ కార్నివాల్ విజేత డైనమిక్ బాయ్స్



క్రికెట్ టోర్నీ విజేత జట్టుతో అతిథులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు వారాలుగా జరుగుతున్న వలసపాకల క్రికెట్ కార్నివాల్ (వీసీసీ) సీజన్-4 ఆదివారంతో ముగిసింది. టెన్నిస్‌బాల్‌తో నిర్వహించిన ఈ టోర్నీలో రాయల్ వీఎస్‌పీ, డైనమిక్ బాయ్స్, బ్లాక్ అలైన్స్, ఎక్స్‌పీరియన్స్ లెజెండ్స్, వీఎస్‌పీ టైగర్స్ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో డైనమిక్ బాయ్స్ విజేతగా, ఎక్స్‌పీరియన్స్ లెజెండ్స్ రన్నర్స్‌గా నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో కరప, వాకాడ సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, వాసంశెట్టి రామారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్, హరీష్ స్పోర్ట్స్ యజమాని రాము, వాకాడ మాజీ ఉప సర్పంచ్ దూడల నారాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్ టోర్నీ విజేత, రన్నర్స్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



శిల్పారామంలో నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

కాకినాడ రూరల్: సాగర తీరాన బీచ్‌రోడ్డులో శిల్పారామం వద్ద ఆదివారం సాయంత్రం నృత్య ప్రదర్శనలు అలరించాయి. బీచ్‌కు వచ్చిన సందర్శకులు శిల్పారామంలో కొద్ది సేపు కాలక్షేపం చేసి నృత్య ప్రదర్శనలు తిలకించారు. రామచంద్రపురంలోని శ్రీలలితా నృత్య నికేతన్ గురువు వర్ధినీడి లలితా నాయుడు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ద్వారా కూచిపూడి నృత్యం నేర్చుకున్న 60 మంది చిన్నారుల్లో పలువురు శిల్పారామంలో ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే తులసీరామ్ శిష్య బృందం జానపద నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. శ్రీలలితా నృత్య నికేతన్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలను శిల్పారామం వేదికగా శిల్పారామం ఆధ్వర్యంలో వర్ధినీడి వీరన్న నాయుడు బహూకరించారు. వేసవిలో శిల్పారామాన్ని సందర్శించాలని పిల్లల నుంచి పెద్దల వరకు వినోదం పొందేలా ఏర్పాట్లు చేశామని ఏట మోహన్‌తేజ తెలిపారు.

పాతికేళ్లకు కలసి.. పదిహేనేళ్ల ప్రాయానికి..!

- పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక
- పాఠశాలలో తెలుగుతల్లి విగ్రహ ప్రతిష్ఠ
- వేళంగి మెర్లాస్ జెడ్పీయూపీ పాఠశాలలో సందడి



వేళంగి హైస్కూలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఎంతో సందడిగా గడిపారు. రెండున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న వీరు ఒకరికొకరు అప్యాయంగా పలకరించుకుని, క్షేమ సమాచారాలు, ఉద్యోగ, వ్యాపార విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అసోషియేషన్ ఆఫ్ ఫ్రెండ్స్ ఫర్ ఎవర్‌గా ఏర్పడి కేవీవీఎస్ఎస్ గుణేశ్వరరావు ఆధ్వర్యంలో గరగ అనిత, హేమారావు, వనులం ఉపేంద్రనాథ్, కడలి లోవరాజు, బి.సతీష్, సీతాలక్ష్మి, తాతాజీ, అడపా వెంకటేశ్వరరావు, చుండ్రు మంగాదేవి, సత్యవతి, వీరలక్ష్మి, శేషవతి, కార్తిక, బి.శ్రీనివాసరావు తమ సహచర విద్యార్థుల చిరునామాలను సేకరించి ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేసి, ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సత్కరించి, తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు సమకూర్చిన తెలుగుతల్లి విగ్రహాన్ని అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేమాని వెంకటరామారావు, పట్టాభిరామారావు ఆవిష్కరించగా, గ్రామపెద్దలు మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నారావు, ప్రస్తుత హెచ్ఎం కె.భారతి తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.



పూర్వవిద్యార్థులు సమకూర్చిన తెలుగుతల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆనాటి హెచ్ఎంలు, గ్రామస్తులు

ఘనంగా అంతర్జాతీయ బాలల రక్షణ దినోత్సవం

కాకినాడ రూరల్: రమణయ్యపేట అడబాల ట్రస్ట్, కాకినాడ ఐడీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ బాలల రక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ బాలలే మానవ జాతికి ముఖ్యమైన ఆస్తి అని, పిల్లల ప్రాముఖ్యతను గుర్తించి వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం బాలలకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, న్యాయవాది పెండెం శ్రీదేవి, కుమార్ యాదవ్, రేలంగి బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.



బాలలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

40 ఏళ్లయినా ఆ జ్ఞాపకాలు పదిలం

- ఎన్ఎస్ఎన్ఎం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సందడి



కరపలో కలుసుకున్న 1985-86 బ్యాచ్ విద్యార్థులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1985–86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కరపలో సందడి చేశారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ, పలకరించుకుంటూ, పాత జ్ఞాపకాలను, ఆనాటి చిలిపిచేష్టలను గుర్తుచేసుకుని ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వీరు యోగ క్షేమాలు, ఉద్యోగ, వ్యాపార విషయాలు, కుటుంబ సభ్యుల వివరాలను పరస్పరం అడిగి తెలుసుకున్నారు. నాటి విద్యార్థులు పలివెల శామ్యూల్‌రాజు, నక్కా రాందాస్, సలాది సతీష్‌రావు, బండే వెంకటేశ్వరరావు, పడాల శ్రీనివాస్, తుమ్మలపల్లి విశాలాక్షి, దవులూరి వెంకటలక్ష్మి, కె.సుధారాణి ఆ బ్యాచ్ విద్యార్థులందరి చిరునామాలు సేకరించి, ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కామశాస్త్రి, రామారావు, ప్రేమకుమారి, మంగాదేవి తదితరులను సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు.

ముగిసిన బాల సంస్కార్ వేసవి శిక్షణ



విజేతలకు బహుమతులు అందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ ఓలేటివారి వీధిలో 30 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి బాల సంస్కార్ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా భగవద్గీత 12వ అధ్యాయం భక్తియోగాన్ని నేర్పి కంఠస్థ పోటీలు నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసం, దేశ భక్తి, దైవభక్తికి సంబంధించిన విషయాలను చల్లా శ్రీకృష్ణవాణి, శ్రీదేవి, అచ్యుతరావు నేర్పించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శ్రీమన్నార్, చేతన్‌శర్మ వ్యవహించారు. పోటీల్లో దువ్వూరి శార్వాణి, దువ్వూరి అభిరామ్ శాస్త్రి, నరాల మహిత ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. తొలుత భరతమాత, హైందవ స్త్రీజాతి మణి మకుటం రాణి అహల్యాబాయి హోల్కర్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవిశంకర్ పట్నాయక్, పరిషత్ సభ్యులు బిక్కిన రాజు, అన్నపూర్ణయ్యశర్మ పాల్గొన్నారు.

విద్య, సాహితీ రంగాల్లో చిరంజీవిని

- ఐడియల్ కళాశాల అధినేత మృతికి పలు ప్రజా సంఘాల నివాళి

కాకినాడ సిటీ: ఐడియల్ కళాశాల అధినేత డాక్టర్ చిరంజీవినీ కుమారి మృతికి సీపీఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చిరంజీవిని కుమారి బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. విద్య, సాహిత్య రంగాల్లో తనదైన ముద్ర వేశారని జోహార్లు అర్పించారు. కాకినాడకు సంబంధించిన సమస్యలపైన, మహిళా సమస్యలపైన ఆమె స్పందించేవారన్నారు. చర్చా గోష్టుల ద్వారా నిరంతరం ప్రజలను జాగృతం చేసేవారన్నారు. ఆమె మొదటి నుంచి వామపక్ష భావజాలంతో మెలిగారని, జనవిజ్ఞాన వేదిక వంటి సైన్స్ రంగంలో బాధ్యతలు తీసుకొని పని చేశారని ప్రసాదరావు అన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



చిరంజీవినీకుమారి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

విద్యా, సాహితీ రంగాలకు తీరని లోటు

విద్యా, సాహితీ రంగాల్లో విశిష్ట కృషి చేసిన ఐడియల్ కళాశాలల అధినేత డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మృతి సాహిత్య లోకానికి, కాకినాడ పట్టణానికి తీరని లోటని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె జీవితాంతం సమాజ సేవకు అంకితమయ్యారని అన్నారు.

ఆమె సేవలకు జోహార్లు

అనేక మంది జీవితాలను వెలుగులోకి తీసుకువచ్చిన మహానుభావురాలు, విద్యారంగానికి ఆమె చేసిన సేవలు అమోఘం, అద్వితీయమని సీపీఐ రాష్ట్ర నాయకులు తాటిపాక మధు అన్నారు. విద్యా, సాహిత్య రంగాల్లో ఆమె లేని లోటును భర్తీ చేయలేమన్నారు. ఆమె జ్ఞాపకాలు మాత్రం అందరి హృదయాల్లో చిరకాలం శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు.

యూటీఎఫ్ సంతాపం

ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మృతికి యూటీఎఫ్ నాయకులు చక్రవర్తి, ఐ.ప్రసాదరావు, నగేష్, సూరిబాబు, ప్రభాకర వర్మ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అభ్యుదయ భావాలు కలిగి సమాజ చైతన్యానికి తన వంతు కృషి చేశారన్నారు. యూటీఎఫ్ సభలకు వచ్చి అనేక సందేశాలు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.

సమన్వయ లోపమే సమస్య

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- ఏళ్లు గడుస్తున్నా మార్చని అధికారులు

సామర్లకోట: పెద్దాపురం–సామర్లకోట మున్సిపాలిటీల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ జరిగి సుమారు ఎనిమిది ఏళ్లు గడుస్తున్నా ఆ రోడ్డులో సమస్యలు పరిష్కారం కాలేదు. నిర్మాణ సమయంలో రహదారి మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్నా వాటి మార్పు జరగలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయం నుంచి మఠంసెంటర్ వరకు ఉన్న నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడానికి ట్రాన్స్‌కోకు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తం మున్సిపాలిటీ చెల్లించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు వదిలించుకున్నారు. ఆ ఫీజులు తమ ఖాతాలో జమ కానిదే ట్రాన్స్‌ఫార్మర్లు మార్చబోమని ఆ శాఖ అధికారులు భీష్మించుకున్నారు. దాంతో ఆ భారం రెండు మున్సిపాలిటీల మీదా పడుతోంది. ఈ రోడ్డులో ప్రమాదాల నివారణకు రహదారి నిర్మాణ సమయంలోనే సెంటర్ డివైడర్ నిర్మించారు. డివైడర్ల మధ్య ఖాళీల నుంచి వాహనాలు రోడ్డు దాటే సమయంలో సైతం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఆ ఖాళీలను మూసి వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసి రాళ్లను తొలగించేలా వత్తిడి చేశారు. దాంతో స్థానికులు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు.



పెద్దాపురం రోడ్డులో ఎస్‌బీఐ వద్ద ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఆ రెండు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అప్రమత్తం

సామర్లకోట–పెద్దాపురం రోడ్డులో ఎస్‌బీఐ వద్ద, పాత పెట్రోలు బంకుకు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆయా ప్రదేశాల్లో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. స్టేట్ బ్యాంకు ఎదురుగా డివైడర్‌కు యూటర్న్ తీసుకునే సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దాంతో నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాత పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే రోడ్డులో యూటర్న్ ఉండటం, అక్కడే ఏటీఎం, మినరల్ వాటర్ ప్లాంటు ఉండటంతో ఆ ప్రదేశం మరింత ఇరుకుగా ఉంటుంది. ఈ మేరకు ఈ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సరకుల పంపిణీని సేవాభావంతో చేయండి

- మంత్రి నాదెండ్ల మనోహర్

కాకినాడ రూరల్: రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీని ప్రభుత్వం ఆదివారం నుంచి చేపట్టిందని, డీలర్లు, కూటమి నాయకులు సేవాభావంతో ముందుకు తీసుకువెళ్లాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. మండలం వలసపాకల గ్రామంలో రేషన్ దుకాణం ద్వారా సరకుల పంపిణీ అనంతరం, వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్, సివిల్ సప్లయిస్ చైర్మన్ తోట సుధీర్, ఎమ్మెల్యే పంతం నానాజీ, జేసీ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ రేషన్ కార్డులు ఉన్నవారికి ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు రేషన్ తీసుకునే అవకాశం కల్పించామన్నారు. సమస్యలు ఉంటే షాపు వద్ద క్యూ ఆర్ స్కాన్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

పెరిగిన భవన నిర్మాణ కూలి రేట్లు

సామర్లకోట: రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలను దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణ కూలి రేట్లు పెంచవలసిన పరిస్థితి ఏర్పడిందని భవన నిర్మాణ కార్మిక సంఘ పట్టణ శాఖ అధ్యక్షుడు ప్రకృతి ఈశ్వరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి భవన నిర్మాణ రంగంలో పని చేసే వారికి సవరణ చేసిన విధంగా భవన నిర్మాణ యజమానులు కూలీ చెల్లించాలన్నారు. తాపీ మేస్త్రికి రూ.750 నుంచి రూ.800, కూలీకి రూ.700 నుంచి రూ.750కి పెంచి కూలీ రెట్లు నిర్ణయించినట్టు తెలిపారు. సంఘం నిర్ణయించిన కూలీ కంటే ఎక్కువ కూలీ వసూలు చేస్తే సీఐటీయు దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలం శ్రీనివాసు, కరణం ప్రసాదరావు, విప్పర్తి కొండలరావు, కరణం గోవింద రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు భైరవ బంగారయ్య, షేక్ బాషా, పి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ సంఘ అధ్యక్షుడు